
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9, కనిష్ఠం 18.5

3
కామారెడ్డి జిల్లా వార్తలు
గురువారం 18 జనవరి 2024

పెద్దయిపల్లిలో నర్సరీ పరిశీలన

రాజంపేట, జనవరి 17: మండలంలోని పెద్దయిపల్లి గ్రామంలో బుధవారం ఎన్ఆర్జీఎస్ పథకం ద్వారా పెంచుతున్న నర్సరీలోని మొక్కలను ఎంపీడీవో బాలకిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయపాలనతో నీటిని అందించడంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. జమ, బొప్పాయి, మునగా, ఉసిరి, గులాబీ, అల్లనేరేడు మొక్కలను నాటించి గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శి సోని, రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపక్ష నేతల.. తలోదారి!

- ఉందామా.. వెళ్దామా?
- అందరి చూపు.. అధికార పార్టీ వైపు
- ఇప్పటికే కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్న స్థానిక సంస్థల ప్రతినిధులు
- పలువురు కౌన్సిలర్‌లు, జడ్పీటీసీలు కాంగ్రెస్‌లో చేరిక
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మారనున్న కామారెడ్డి సీన్

కామారెడ్డి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల అనంతరం కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రాజకీయ నేతల్లో నిశబ్ద వాతావరణం నెలకొంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒకే ఒక స్థానం గెలుచుకోవడంతో ఆ పార్టీలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పక్కచూపులు చూస్తున్నారు. స్థానికంగా తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి కొందరు నేతలు పార్టీలో ఉందామా.. వెళ్దామా అంటూ తమ దగ్గరి వారితో సలహాలు, సూచనలు తీసుకుం



టున్నారు. నాలుగు నియోజకవర్గాల్లోని మండలం, మున్సిపాలిటీలు, పలు హోదాల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్నవారిలో అత్యధికులు బీఆర్ఎస్‌కు చెందిన వారు కావడం గమనార్హం. ఈ నేతల్లో చాలా మంది ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి వచ్చిన వారు కావడం విశేషం. ప్రస్తుతం ఈ నేతలు రాజకీయ భవిష్యత్తు తీర్చి దిద్దుకోవడానికి గతంలో బీఆర్ఎస్‌లో చేరి ప్రజలకు సేవలు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారానికి దూరం కావడంతో ప్రతిపక్ష పార్టీలో ఉండి ప్రజలకు సేవలు అందించలేకపోతున్నామనే అభిప్రాయంతో ప్రజాప్రతినిధుల్లో కనపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ వారు పెద్ద ఎత్తున ఆఫర్‌లు ఇచ్చినప్పటికీ వారు తిరస్కరించి పార్టీ కోసం పని చేశారు. కాగా పరిస్థితులు మారడంతో వారి రాజకీయ జీవితం ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్ వైపు చూపులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, ముఖ్యనేతలు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడానికి పార్టీ పెద్దలతో చర్చలు జరుపుతున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 25 మండలాల్లో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో అత్యధికు లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లే ఉన్నారు. సర్పంచ్‌ల పదవి కాలం జనవరి 31 నాటికి ముగియనుంది. దీంతో వారు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధులు సైతం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొందరు జడ్పీటీసీలు, ఎంపీపీలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా కామారెడ్డి మున్సిపాలిటీలోని 9 మంది కౌన్సిలర్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. రైతు సహకార సంఘాల్లోనూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారు. వీరిలోను కొందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. పలువురు సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై సైతం అవిశ్వాసానికి నోటీసులు జారీ చేశారు. ఇలా నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు మాత్రం బీఆర్ఎస్‌లో కొనసాగడం పట్ల సుదీర్ఘ ఆలోచన చేస్తున్నట్లు ఆ పార్టీ బడా నాయకుల అనుచరులు అంటున్నారు.

వలసలతో పార్టీని పటిష్టం చేసుకునే దిశలో..

సుదీర్ఘకాలంగా అధికారం లేక పోవడంతో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలోని క్షేత్రస్థాయిలో పట్టుసడలింది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తమ పార్టీలో చేర్చుకుంటే పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కలిసోస్తుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆహ్వానం పంపిన నేతలకే తిరిగి పార్టీలోకి తీసుకోవడానికి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లు ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా తమ రాజకీయ భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇస్తే వెంటనే పార్టీ మారుతామన్న ప్రతిపాదనలు కొందరు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పెద్దల ముందు పెట్టినట్లు సమాచారం.

పార్లమెంట్ ఎన్నికలకు ముందు..

అధికార కాంగ్రెస్ పార్టీలో చేరదలిచిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పార్లమెంట్ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే పార్టీ మారితే తమకు ప్రాధాన్యం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో కొందరు నేతలు పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ముందు పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే తమకు గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నారు. దీంతో తిరిగి స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ తరపున పోటీ చేసే అవకాశం లభిస్తుందని నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగిన తమ రాజకీయ భవిష్యత్తు గల్లంతు కావడం ఖాయమని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.



ప్రయోగం చేసేదెట్లా?



కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రయోగశాల

- ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- మూలనబడిన భౌతికశాస్త్ర పరికరాలు
- వృక్ష, జంతుశాస్త్రాలకు మెటీరియల్ కొరత
- మూడేళ్లుగా నిధులు రాక ఇబ్బంది
- ప్రయోగపరీక్షల పేరుతో భారీగా వసూళ్లు చేస్తున్న పలు ప్రైవేట్ కళాశాలలు

కామారెడ్డి టౌన్, జనవరి 17: ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలకు ఇంటర్ బోర్డు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. అదేనెల చివరలో వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో నిధుల్లేక ప్రభుత్వ కళాశాలల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రాక్టికల్స్‌కు కావాల్సిన పరికరాలు, కెమికల్స్, ఇతరత్రా సామగ్రికి గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడం లేదు. విద్యార్థులతో ముందుగానే సాధన చేయించాల్సిన అధ్యపకులు పరీక్షలప్పుడే ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. దీంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ కళాశాలలు, 18 ప్రైవేట్ కళాశాలలు, 42 ప్రభుత్వ సెక్టార్‌లోని సోషల్ వెల్ఫేర్, గురుకుల, మోడల్ స్కూల్ తదితర కళాశాలలు ఉన్నాయి. ఇందులో 10,929 మంది విద్యార్థులు ఉండగా ఇందులో దాదాపు 5వేల వరకు సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు ఉన్నారు.

అన్ని కళాశాలల్లోనూ..

ఇంటర్ విద్యార్థులకు కీలకమైన ప్రాక్టికల్స్ నిర్వహణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భారంగా మారింది. ఏటా ఆయా కాలేజీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర వసతులు, శిథిలావస్థలో ఉన్న ల్యాబ్‌లలో తుప్పుపట్టిన పరికరాలతోనే విద్యార్థులు ప్రాక్టికల్స్ చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి భౌతికశాస్త్ర ప్రయోగ పరికరాలు, రసాయన శాస్త్రం ప్రయోగాలలో వాడే రసాయనాలు, జంతు, వృక్షశాస్త్రల ప్రయోగాల్లో వాడే మెటీరియల్స్ చాలా చోట్ల అందుబాటులో లేవని తెలుస్తోంది. వీటిని కొనుగోలు చేయడానికి ప్రతీ కళాశాలకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ నిధులను ఇంటర్ బోర్డు కళాశాలలకు విడుదల చేసిన తర్వాత వాటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇదంతా జరిగేసరికి దాదాపు మరో 20 రోజుల సమయం పడుతుందని పలువురు అధ్యాపకులు పేర్కొంటున్నారు. ప్రతీ సంవత్సరం ప్రైవేట్ కళాశాలల విద్యార్థులతో పోలిస్తే ప్రభుత్వ కళాశాలల ప్రాక్టికల్స్‌లో తక్కువ మార్కులు సాధిస్తున్నారు.

ప్రైవేట్‌లో ముక్కుపిండి వసూళ్లు

జిల్లా వ్యాప్తంగా 18 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మొత్తంలోని కళాశాలల్లో ప్రయోగ పరీక్షల పేరుతో విద్యార్థుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నట్లు పలువురు విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. కళాశాలను బట్టి వీరు ఎంపీసీ విద్యార్థుల నుంచి రూ.1500, బైపీసీ విద్యార్థుల నుంచి రూ.2000 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రాక్టికల్స్ సమయంలో ఎగ్జామినర్‌లకు ఇవ్వాలని లేకపోతే మార్కులు రావని భయపెడుతూ ఈ వసూళ్ల కార్యక్రమం నిర్వహిస్తున్నారని వారు అంటున్నారు. చాలా కళాశాలల్లో కనీసం ప్రయోగశాలలు, పరికరాలు కూడా లేవని విద్యార్థులకు ఏనాడూ ప్రయోగశాల ముఖం చూపించిన దాఖలాలు లేవని, కానీ వాటి పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థిసంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మరికొన్ని కళాశాలలు అయితే మరో అడుగు ముందుకేసి ప్రాక్టికల్స్ రికార్డులను వారే తెప్పించి అధికారులకు అంటగడుతున్నారని తెలుస్తోంది.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ అర్బన్, జనవరి 17: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తూ ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 18 గురువారం నామినేషన్ల గడువు ముగియనుండటంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులను ఖరారు చేసింది. చివరి వరకు ఉత్కంఠతతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన అధిష్ఠానం పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, సీనియర్ నాయకుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బలుమూరి వెంకట్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది.

పాల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి

● విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ

తాడ్వాయి, జనవరి 17: నాణ్యమైన పాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టెం లక్ష్మీ తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం కరడ్‌పల్లి గ్రామంలోని పాల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాల ఉత్పత్తిలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే పాలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. రైతులు పాల ఉత్పత్తి పెంచడంలో కృషి చేయాలన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ రైతులు పాల ఉత్పత్తిని తమ సొంత వృత్తిగా భావించాలని సూచించారు. పాల ఉత్పత్తితో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంసీయూ అధ్యక్షుడు నరసింహారెడ్డి, డైరెక్టర్‌లు కిష్టారెడ్డి, మేనేజర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా.. సీఎంఆర్‌ను అందించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



లింగంపేటలో నాగన్న బావి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, జనవరి 17: గత ఖరీఫ్ 2022-23కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను ఈ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి పెట్టుటకు రైసుమిల్లర్‌లు ప్రణాళిక బద్ధంగా 24 గంటలు మిల్లుల్లో బియ్యాన్ని మర ఆడించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి 62 బాయిల్డ్, రా రైసుమిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్‌కు సంబంధించి ఇంకను 50 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థకు పెట్టాల్సి ఉందని తెలిపారు. ఇకమీదట గడువు పొడగింపు ఉండదని, మిల్లర్లు ఈ పది రోజులు మిల్లులను 24 గంటలు పనిచేసే విధంగా చూడాలని అన్నారు. లక్ష్యాన్ని అధిగమించని మిల్లర్లకు 125 శాతం పెనాల్టీ విధించడంతో పాటు వచ్చే సీజన్‌లో ధాన్యం కేటాయింపబడదని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో 39 రైసుమిల్లర్లు లక్ష్య సాధనలో చాలా వెనుకబడి ఉన్నారని, బియ్యాన్ని మరాడించి ఎఫ్‌సీఐకి తరలించడంలో పోటీ పడాలని, లక్ష్యాన్ని అధిగమించిన మిల్లర్ల పరస్పర సహకారంతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. జిల్లాలో రోజుకు 4,221 మెట్రిక్ టన్నుల ధాన్యం మర ఆడించేందుకు అవకాశమున్న అలసత్వం కారణంగా రాష్ట్రంలో చాలా వెనుకబడి ఉన్నామని, రాష్ట్ర బృందాలు కూడా జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కుంటిసాకులు చెప్పకుండా లక్ష్యాన్ని 10 రోజుల్లో చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా రోజు ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి తరలించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లిఖార్జున్‌బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్‌సింగ్, జిల్లా రైసుమిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నాగన్న బావి పనులను పరిశీలించిన కలెక్టర్

లింగంపేట: మండల కేంద్రంలోని పురాతన నాగన్న బావి (మెట్ల బావి) పనులను బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. బావి స్థలం విషయంలో పక్కన ఉన్న పట్టాదారు వివాదం చేయడంతో సర్వేయర్లతో సర్వే చేయించి 18 గుంటల భూమిని పురావస్తు శాఖకు అందజేశారు. భూమికి సరిహద్దులను వేయించారు. త్వరలో నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా మారుతుందని ఆయన తెలిపారు. సుధాకర్ బావి పనులను వేగవంతం చేయాలని అధికారులను, ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌లతో పాటు అధికారులు ఉన్నారు.

‘మా భూమిని మా పేరిట చేయాలి’

కామారెడ్డి టౌన్, జనవరి 17: మా భూమి మాపేరు మీద చేయాలని లింగాపూర్‌కు చెందిన పలువురు రైతులు ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగాపూర్ శివారులోని అబ్దుల్‌నగర్ వద్ద గల సర్వే నెంబర్ 35/ఏ అనే భూమిలో 15 మంది రైతులకు చెందిన 15 ఎకరాల 35 గుంటల భూమి ఉంది. ఆ భూమిని అప్పటి వీఆర్‌వో ఆంజనేయులు సహకారంతో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీంతో తాము ఆర్‌డీవో కోర్టులో విచారణకు కోరగా విచారణ చేసి ఆ భూమిని తమకు అప్పగించేలా చూడాలని వీఆర్‌వో ఆంజనేయులుకు సూచించారు. కేవలం అందులో 3 ఎకరాలను 15 మందికి 8 గుంటల చొప్పున మాత్రమే చేసిచ్చాడు. మిగిలిన భూమిని ధరణిలో పెండింగ్‌లో ఉండేట్లు చేయడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే తగిన విచారణ చేపట్టి మా భూమి మాకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డీవోకు విన్నవించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజ నర్సయ్య, రాందాస్, షైసయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యక్షుడిగా మధుసూదన్ జోషి



ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జనవరి 17 : ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడిగా వెక్టర్ జూనియర్ కళాశాల డైరెక్టర్ మధుసూదన్‌జోషి ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం నగరంలో జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్ జోషి, ప్రధాన కార్యదర్శిగా హన్మంత్‌రావు, కోశాధికారిగా సంఘం సంతోష్, ఉపాధ్యక్షుడిగా మైసయ్య, సంయుక్త కార్యదర్శిగా అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాశ్, బాలాజీరావ్, గౌరవ అధ్యక్షుడిగా సీ హెచ్ రజినీకాంత్, ముఖ్య సలహాదారులుగా ముజీబ్ అలీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వరదారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, హరిప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు జూనియర్ కళాశాలల సమస్యలపై పనిచేస్తామని తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతీ ఒక్కరికి మధుసూదన్‌జోషి ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కమ్మర్‌పల్లి, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల మండలస్థాయి అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, స్థానిక ప్రభుత్వ వైద్యులు ఎస్ఎల్ఎన్ స్వామి, ఎంపీవో సదాశివ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈవో కావ్య, ఉప సర్పంచ్ పాలెపు చిన్న గంగారాం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు

నిజామాబాద్ లీగల్, జనవరి 17: మద్యం తాగి ఆటోను నడిపిన రాజు అనే డ్రైవర్‌కు స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖాదీర్ 10 రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. గాంధీ చౌక్‌లో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా రాజు అనే ఆటోడ్రైవర్ మద్యం తాగి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటో నడుపుతున్నాడు. అతడిని పరీక్షించగా మద్యం తాగినట్లు నిర్ధారించిన పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. కోర్టులో ఆటో డ్రైవర్ నేరాన్ని అంగీకరించడంతో 10రోజుల జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తికు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్నసాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్లు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెంబర్ 66లో 2009-10 పహణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబూచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావో‌స్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావో‌స్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోనేలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సిల్వర్ మెడల్

కామారెడ్డి టౌన్, జనవరి 17: మహబూబ్‌నగర్ జిల్లాలోని జరిగిన జాతీయ నెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో గాంధారి మండలం గండివేట్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయుడు రఘురాం సిల్వర్ మెడల్ సాధించాడని టీజీపెటా అధ్యక్షుడు హీరాలాల్ తెలిపారు. తెలంగాణ టీం నుంచి గోల్ కీపర్‌గా వెళ్లాడని వివరించారు. ఈ సందర్భంగా రఘురాంను టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు సంఘీమోహన్, సాయిమౌర్యలు అభినందించారు.



కుసుమ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ

కుసుమ పంటలో పేనుబంక ఉధృతిని అరికట్టాలి

తాడ్వాయి, జనవరి 17: కుసుమ పంటలో పేనుబంక ఉధృతి ఎక్కువగా ఉందని దీనిని అరికట్టాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ తెలిపారు. బుధవారం బ్రాహ్మణపల్లిలో కుసుమ, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుసుమ పంటలో ఎక్కువగా పేనుబంక ఉధృతి ఉందని తెలిపారు. దీని నివారణకు అసెట్ మాప్రైడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రైడ్ 0.3 మి.లీలు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి పంటలో ఉల్లికోడు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు వెంటనే ఫిప్రోనిల్ మందును పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్‌రెడ్డి, రైతులు వెంకట్ రావు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో గుండెపోటుతో రాజంపేట వాసి మృతి



జొన్నల రవి (ఫైల్)

రాజంపేట, జనవరి 17: మండల కేంద్రానికి చెందిన జొన్నల రవి(35) దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుడి తమ్ముడు గణేష్ తెలిపారు. 9 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. రెండు సంవత్సరాల క్రితం మండలానికి వచ్చి మళ్లీ వెళ్లాడు. రోజులాగే పనులు ముగించుకుని రాత్రి నిద్రపోయాడని తెలిపాడు. గణేష్ సైతం దుబాయ్‌లోనే ఉండడంతో మండలంలోని కుటుంబ సభ్యులకు ఆయన సమాచారం చేర వేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరో నెలలో సెలవుపై ఇంటికి తిరిగి వస్తానని చెప్పిన రవి కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. రవి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చే విధంగా చూడాలని అధికారులకు అతని భార్య లత, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఏ

రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలి

బీబీపేట, జనవరి 17: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆర్‌టీఏ వెహికల్ ఇన్స్‌పెక్టర్ విద్యాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 35వ మాసోత్సవ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాన్ని నడిపేటప్పుడు ధ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, కారోబార్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు శిక్ష

దోమకొండ, జనవరి 17: మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పోలీసులకు పట్టుబడిన మండలంలోని అంచనూర్ గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తికి బుధవారం కామారెడ్డి ద్వితీయశ్రేణి న్యాయాధికారి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి సస్పెన్షన్

మద్నూర్, జనవరి 17: కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గజానంద్ పటేల్‌ను తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జీ సురబీ త్రివేది సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన గజానంద్ పటేల్ గత కొన్ని సంవత్సరాలుగా కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అపోజిట్ పార్టీకి మద్దతు తెలుపడంతో జిల్లా కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు ఆయనను బాధ్యతల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

నిజాంసాగర్ కాలువల నిర్మాణం చేపడతాం

- ప్రతీ గుంటకు సాగు నీరు అందిస్తాం
- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

బీర్కూర్, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు, పంట కాలువలను పూర్తి స్థాయిలో నిర్మించి రైతులకు సాగు నీటిని అందిస్తామని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి బీర్కూర్ మండలంలోని కాలువలను పరిశీలించారు. డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువల స్థితిగతులను చూశారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పంట పొలాలకు సాగు నీరు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు తమ పంట పొలాలకు సరిగ్గా సాగు నీరు అందడం లేదని ఇటీవల తన దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు. ఈ మేరకు పంట కాలువలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. దామరంచ, అన్నారం, కిష్టాపూర్, బీర్కూర్, బొప్పాస్‌పల్లి, భైరాపూర్, బీర్కూర్ తండా, తదితర గ్రామాల్లో పర్యటించి పంట కాలువలను పరిశీలించారు. 26/4వ డిస్ట్రిబ్యూటరీ కాలువను నిర్మించాలని ఎన్నో సంవత్సరాలుగా బీర్కూర్ రైతులు పాలకులను కోరుతున్నా, ఇప్పటి వరకు కాలువ నిర్మాణం చేపట్టలేదన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో కాలువ నిర్మాణానికి అధికారులు సర్వే నిర్వహించి, ప్రతిపాదనలు పంపించారని, అప్పటి ఇరిగేషన్ మంత్రి నిధులు కేటాయించడంతో పాటు పనులకు శంకుస్థాపన కూడా చేశారని ఆయన గుర్తు చేశారు. అయినా గత పాలకులు పనులు మాత్రం పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి 26/4 డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కాలువ నిర్మాణం చేపట్టి బీర్కూర్ రైతాంగానికి సాగు నీటిని అందిస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బీర్కూర్ రైతాంగం సాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. కాలువ నిర్మాణం పూర్తి చేస్తే మండలంలోని చెరువులన్నీ జలకళను సంతరించుకుంటాయనీ, వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులకు సాగు నీటి ఇబ్బందులు రానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నందు రెడ్డి, చందు, శంకర్, విజయ ప్రకాష్, సాహెబ్ రావు, కాంత్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, నరేష్ పటేల్, ఇక్బాల్, కృష్ణారెడ్డి, భాస్కర్, మాసానీ శ్రీనివాస్ రెడ్డి, మొగులు గొండ, బుద్దే గంగాధర్, ప్రేమ్, పేరయ్య, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో డిస్ట్రిబ్యూటరీ కాలువను పరిశీలిస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

బిచ్కుంద, జనవరి 17: సొసైటీ సభ్యులు అందరు వ్యవసాయ పరంగా రైతుల అభివృద్ధికి కృషిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బుధవారం మండలంలోని పుల్కల్ సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా రాంరెడ్డి కొనసాగుతుండగా సొసైటీ సభ్యుల సమక్షంలో ఎన్నిక నిర్వహించగా చైర్మన్‌ను పుల్కల్ భీంరెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. సొసైటీ కార్యదర్శి సాయిప్రకాష్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికపరంగా రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా, తనవంతు సహాయ సహకారాలు అందించడానికి కృషిచేస్తానని తెలిపారు. ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని సీఎం రేవంత్‌రెడ్డి ఖచ్చితంగా అమలుచేస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న ప్రజాసమస్యలు తీర్చడానికి దృష్టిసారించి అభివృద్ధి పనులు చేపడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్ అప్పుశెట్కార్, సొసైటీ కార్యదర్శి, డైరెక్టర్‌లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

చర్చిని ప్రారంభించిన ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ మండలంలోని నాగల్‌గాం గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని సూచించారు. భగవంతున్ని సేవలో ఉండి దేవుని మంచి బాటలో పయనించాలని సూచించారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే తోటను సన్మానించారు, ఈ కార్యక్రమంలో పెద్ద ఏడ్గి సర్పంచ్ వినోద తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

పిట్లం జనవరి 17: మండలంలోని కంబాపూర్ గ్రామంలో బుధవారం ఉపాధి హామీ రూ.20 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయితీ భవనాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ ప్రారంభించారు. కంబాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికినారు. 20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కవితాపాటిల్ శాలువ, పూలమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కంబాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ గద్దె వద్ద పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీఎల్పీఓ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, అడ్వకేట్ రాంరెడ్డి, నాయకులు రమేష్, మురళీధర్‌గౌడ్, మొహన్‌రెడ్డి, సూరత్‌రెడ్డి, ఇమ్రోజ్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలి

- జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్
- భిక్కనూరు పీహెచ్‌సీ తనిఖీ

భిక్కనూరు, జనవరి 17: ఆసుపత్రుల్లో తప్పనిసరిగా కొవిడ్ టెస్ట్ కిట్స్, ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ సూచించారు. బుధవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను తనిఖీ చేసి కొవిడ్ టెస్ట్ కిట్స్‌ను, మందులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు కొవిడ్ వ్యాప్తి ఎక్కువ అవుతున్నందున కొవిడ్ కిట్స్, ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలని, గ్రామాల్లో కొవిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హెమిమా, సిబ్బంది పాల్గొన్నారు.



భిక్కనూరు పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న దృశ్యం



రామాలయంలో చెత్తను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో 'ఆలయాల శుభ్రం'

లింగంపేట, జనవరి 17: మండలంలో బుధవారం రామాలయం, ముత్యాల పోచమ్మ, దత్తాత్రేయ ఆలయాలను బీజేపీ నాయకులు శుభ్రం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆలయాలను శుభ్రం చేసినట్లు బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు దత్తురాంలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మురళి, రాంచందర్, బొల్లారం సాయిలు, ఉదేశ్, నారాయణలతో పాటు నాయకులు ఉన్నారు.

నేడు ఆలయ పరిశుభ్రత అభియాన్ కార్యక్రమం

బాన్సువాడ టౌన్, జనవరి 17: ఆలయ పరిశుభ్రత అభియాన్ కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ శివారులో గల తెలంగాణ తిరుపతి దేవస్థానంలో గురువారం ఉదయం 8 గంటలకు ఆలయంను పరిశుభ్రం చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

పెద్ద కొడప్‌గల్, జనవరి 17: మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒకటి మండలంలోని బేగంపూర్ తాండ పరిధిలో చోటు చేసుకుంది. తండా వాసుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. తండాకు చెందిన గురుదాస్(28) సోమవారం మధ్యాహ్నం సమయంలో అతిగా మద్యం తాగి ఆ మత్తులో పొలం వద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడని, దీనిని గమనించిన తండావాసులు గురుదాస్‌ను చికిత్స నిమిత్తం బాన్స్‌వాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గురుదాస్ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోనా రెడ్డి తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 17: కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలను బుధవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరినట్లు మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జహీరాబాద్ పార్లమెంట్ ప్రభారి బద్దం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీష్

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

గాంధారి, జనవరి 17: ప్రతి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని బుధవారం పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ సతీష్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాలలో టాక్స్‌లు వంద శాతం వసూలు చేయాలని నర్సరీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సోషల్ ఆడిట్, ఎస్‌బీఎం పనులపై కార్యదర్శులు పకడ్బందీగా పనిచేయాలని, శానిటేషన్‌పై దృష్టిపెట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలను వినియోగించుకోవాలి

సదాశివనగర్, జనవరి 17: అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్ సేవలను రైతులందరూ వినియోగించుకోవాలని సింగిల్ విండో చైర్మన్ మర్రిసదాశివరెడ్డి అన్నారు. బుధవారం రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సుడోమనాస్‌ను వరి పైరుకు అగ్గితెగులు రాకుండా వాడుకోవడానికి ఉచితంగా అందించారు. వీటితో పాటు కూరగాయాలు పండించే రైతులకు కేవలం 20 పైసలకు ఒక మొక్కచొప్పున గరిష్ఠంగా పదిహేను వందల మొక్కల వరకు ఇవ్వడానికి రిలయన్స్‌ఫౌండేషన్ ముందుకు వచ్చిందని చైర్మన్ తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌గా బీబీపేటకు చెందిన సిద్దిరాములుహాజరై తాను ఏ విధంగా వర్మికంపోస్ట్ తయారుచేస్తున్నాడో రైతులకు తెలిపారు. వేస్ట్ నుండి వర్మికంపోస్ట్ తయారుచేసుకుని పంటలకు వాడుకున్నట్లయితే గణనీయంగా రసాయన ఎరువులను తగ్గించుకోవచ్చని అనుభవపూర్వకంగా తెలుసుకున్న విషయాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విజయ పాలడైరీ అధ్యక్షుడు నర్సారెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల సిద్దిరాములు, వార్డుమెంబర్ రాజయ్య, రైతులు మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, పద్మారెడ్డి, బాలరాజ్, గంగరాజం, కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గంగయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ పాత బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్టీవో శాఖ ఆధ్వర్యంలో అవగాహన

మద్నూర్, జనవరి 17: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆర్టీవో శాఖ ఆధ్వర్యంలో ప్రయాణీకులు, వాహనదారులకు రోడ్డు నియమాలు పాటించే విధంగా అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ రాంచందర్ నాయక్, మద్నూర్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో పోలీసుల బందోబస్తు

భిక్కనూరు, జనవరి 17: మండల కేంద్రంలో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మర్కంటి శ్రీకాంత్ అంత్యక్రియల సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా భిక్కనూరు సీఐ తిరుపయ్య ఆధ్వర్యంలో 50 మంది పోలీసులతో బుధవారం బందోబస్తు నిర్వహించారు. కాగా శ్రీకాంత్ అంత్యక్రియల సందర్భంగా రెవెన్యూ సిబ్బంది రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి శ్రీకాంత్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జనవరి 17: జిల్లాలోని 19 మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 3 నుంచి 8వ తరగతి వరకు, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కొరకు అర్హతగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు టీఎంఆర్ఈఐఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వతరగతిలో మైనార్టీలకు ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసెస్, నాన్ మైనార్టీలకు లక్కీడ్రా ద్వారా 6,7,8 తరగతులలో, ఫస్ట్ కమ్ ఫస్ట్ బేసెస్ ఇంటర్మీడియెట్‌లో ఎస్సెస్సీలో వచ్చిన జీపీఏ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

మద్నూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మద్నూర్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి గాను ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార భద్రత, ప్రధాన మంత్రి సురక్షయోజన, పలు సంక్షేమ పథకాలను ప్రజలకు అధికారులు వివరించారు. మద్నూర్ యూనియన్ బ్యాంకు మేనేజర్ పాటిల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రుణాల ను అందజేస్తుందని, తమ శాఖ ద్వారా నిరుద్యోగ యువకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. మా సంకల్పం, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం అన్నారు. కార్యక్రమంలో డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యులు బస్వరాజ్, ఏఈవో అనిల్, మద్నూర్ జీపీ కార్యదర్శి సందీప్, సీనియర్ బీజేపీ నాయకులు రమేష్ తమ్మేవార్, మండల బీజేపీ అధ్యక్షుడు హన్మాండ్లు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, పోస్టాఫీసు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో వికసిత్ భారత్‌లో పాల్గొన్న అధికారులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- గుంటూరు కారం

బాన్సువాడ

మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

